నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, శనివారం 30 మార్చి 2024 | KAMAREDDY



## భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

ఉమ్మడి జిల్లాలో క్రైస్తవులు శుక్రవారం గుడ్‌ఫ్రైడేను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తుకు శిలువ వేసిన సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలను పాస్టర్లు వినిపించారు. రెంజల్ మండలం నీలా గ్రామంలో భక్తులు శిలువతో ఊరేగింపు నిర్వహించారు.

# రేపు కామారెడ్డికి హరీశ్‌రావు రాక



- నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొననున్న మాజీ మంత్రి
- భారీగా తరలిరానున్న కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు
- హాజరుకానున్న పోచారం, గంప, గాలి అనిల్‌కుమార్

నిజామాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పని చేస్తోంది. ఇందులో భాగంగా నియోజకవర్గ స్థాయి సమావేశాలతో దూకుడు పెంచింది. అభ్యర్థిని ఇప్పటికే అధినేత కేసీఆర్ ప్రకటించగా గులాబీ పార్టీలోని సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ గాలి అనిల్ కుమార్ విస్తృతంగా పర్యటిస్తున్నారు. బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో సమావేశాలు పూర్తవగా ఆదివారం కామారెడ్డి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. గంప గోవర్ధన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, బీఆర్‌ఎస్ లోక్‌సభ అభ్యర్థి గాలిఅనిల్ కుమార్‌తోపాటు బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులంతా హాజరు కానున్నారు. కామారెడ్డి పట్టణంలోని సత్యా గార్డెన్‌లో బీఆర్‌ఎస్ సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తెలిపారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయంతో కాంగ్రెస్, బీజేపీకి తగిన బుద్ధి చెప్పేందుకు కదం తొక్కాలని శ్రేణులను కోరారు.

**సిట్టింగ్‌పై ఫోకస్..**

జహీరాబాద్ లోక్‌సభ స్థానం గులాబీ పార్టీకి కంచుకోట లాంటిది. 2014, 2019లో వరుసగా ఇక్కడ భారత రాష్ట్ర సమితి పార్టీ గెలుపొందింది. కేసీఆర్ ఆశీస్సులతో రాజకీయ రంగ ప్రవేశం చేసిన బీబీపాటిల్ సాంకేతికంగా మద్నూర్ వాసి అయినప్పటికీ ఆయనకు తెలుగు భాషనే రాదు. ఇక్కడ ప్రాంత ప్రజలతోనూ పరిచయాలు కూడా అంతగా లేవు. భౌగోళికంగానూ ఎలాంటి అవగాహన లేకపోయినా గులాబీ పార్టీ ఊపులో బీబీపాటిల్‌కు అదృష్టం కలిసి వచ్చింది. గులాబీ కండువా కప్పుకున్న వ్యాపారిని నమ్మి లోక్‌సభకు రెండుసార్లు కేసీఆర్ పంపిస్తే అక్కున చేర్చుకున్న బీఆర్‌ఎస్ పార్టీకి ద్రోహం చేసి బీబీపాటిల్ బయటికి వెళ్లారు. బీజేపీకి ఈ నియోజకవర్గంలో పోటీ చేసేందుకు లీడర్లే దిక్కు లేకపోవడంతో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారిని వెంటాడి చేర్చుకున్నది. కేసీఆర్ ఆదరిస్తే బీబీ పాటిల్ మాత్రం కనీస నైతికతను ప్రదర్శించకుండా పార్టీ మారడంపై ఇప్పటికే జహీరాబాద్ నియోజకవర్గంలోని గులాబీ శ్రేణులంతా తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. మొన్ననే బీఆర్‌ఎస్ సమావేశంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే తీవ్ర స్థాయిలో బీబీపాటిల్ చేసిన ద్రోహంపై నిప్పులు చెరిగారు. బీఆర్‌ఎస్ పార్టీలో ఉంటూ నమ్మక ద్రోహానికి పాల్పడిన ఘటనను ఉదహరించారు. బీజేపీ, బీబీ పాటిల్‌కు సరైన రీతిలో బుద్ధి చెప్పేందుకు బీఆర్‌ఎస్ నేతలంతా శపథం చేస్తున్నారు. ఇందులో భాగంగా కామారెడ్డి సమావేశం ప్రాధాన్యతను సంతరించుకున్నది.

- వట్టిపోతున్న బోర్లు..
- కాలిపోతున్న మోటర్లు
- పెట్టుబడి కూడా చేతికిరాని పరిస్థితి
- వెంటాడుతున్న అప్పులు
- ఆందోళనలో సోమార్‌పేట్ రైతన్నలు

## నీళ్లు ఇంకిపోతున్నయ్..
# పొలాలు ఎండుతున్నయ్





వట్టిపోయిన బోరును చూపిస్తున్న బానోత్‌రెడ్డి

**కామారెడ్డి జిల్లాలో** రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వేసవికాలం కావడంతో నీటి వనరులు వేగంగా పడిపోతున్నాయి. పదేండ్ల కాలంలో ఇలాంటి పరిస్థితిని ఎన్నడూ చూడలేదని మండలంలోని సోమార్‌పేట్ రైతులు వాపోతున్నారు. గ్రామంలో రైతుల పంట పొలాలు సాగునీరు లేక ఎండిపోతున్నాయి. ఎన్నడూలేని విధంగా భూగర్భ జలాలు అడుగంటడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కనీసం పెట్టుబడి వచ్చే పరిస్థితి కూడా లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ వేసవిలో రెండెకరాలు ఉంటే ఎకరం, మూడెకరాలుంటే ఎకరంన్నర, నాలుగెకరాలు ఉంటే రెండెకరాల్లో మాత్రమే పంటలు వేశారు. ఉన్న పొలంలో సగం పంటలు వేస్తే అవికూడా నీళ్లులేక ఎండిపోతున్నాయని వాపోతున్నారు.

–మాచారెడ్డి, మార్చి 29

### ఎకరం పంట మొత్తం పోయింది..

**నాకు ఎకరం 20** గుంటల భూమి ఉన్నది. ఎకరం విస్తీర్ణంలో వరి పంట వేసిన. మొదట్లో మంచిగానే నీళ్లచ్చినయి. తర్వాత బోరు పారకపోవడంతో పంట పూర్తిగా ఎండిపోయింది. సుమారు రూ.15 వేల వరకు పంట పెట్టుబడి పెట్టిన. పంట పూర్తిగా ఎండిపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాం. గతంలో ఎన్నడూ ఇలా కాలేదు. వ్యవసాయం మీదనే అధార పడి జీవిస్తున్నాం.

-కట్కూరి నాగరాజు, సోమార్‌పేట



### పొలంలో పశువులను మేపుతున్నా..

**నాకున్న రెండెకరాల** భూమిలో ఒక బోరు మోటరు ఉన్నది. ఎకరమున్నర పొలంలో వరి పంట వేసిన. పంటకు సరిపడా నీళ్లు అందక పూర్తిగా ఎండిపోయింది. బోర్లల్లో నీళ్లు లేక మోటర్ నడిపించే సరికి మోటర్ కూడా కాలిపోయింది. రూ.12 వేలు పెట్టి చేయించినానీళ్లు రావడం లేదు. చేసేది లేక ఎండిన పొలంలో పశువులను మేపుతున్న. పంట పెట్టుబడి కోసం రూ.15 వేలు అప్పు చేసిన. మా గ్రామంలో రైతులందరి పరిస్థితి ఇలాగే ఉన్నది. భూమిని నమ్ముకొని బతికే రైతులకు ఇలాంటి కష్టం వస్తే ఎలా ముందుకెళ్లేది.

**- లాల్**, సోమార్‌పేట, మాచారెడ్డి మండలం






### పదేండ్లలో ఎప్పుడూ ఎండిపోలేదు.

**నాకు నాలుగెకరాల** భూమి ఉన్నది. ఒకటిన్నర ఎకరంలో వరి వేశాను. పంటకు నీళ్లు కావాల్సిన సమయంలో కరెంట్ లేక పూర్తిగా ఎండిపోయింది. రెండు బోర్లలో నీళ్లు ఇంకిపోవడంతో దాదాపు రూ.10 వేలు పెట్టి క్రషింగ్ చేయించినా ఫలితం దక్కలేదు. ఇప్పటి వరకు దాదాపు రూ. 20 వేలు వరకు పెట్టుబడి పెట్టిన. రైతుబంధు కూడా ఇంకా రాలేదు.

**-బానోత్ లాల్**, సోమార్‌పేట



రైతుల పక్షాన పోరుబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి
- వరికి రూ.500 బోనస్ ఇవ్వాలి
- పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలి
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపు
- భీమ్‌గల్‌లో 'రైతుల పక్షాన పోరుబాట'
- తరలివచ్చిన రైతులు

# హామీల అమలుకు నిలదీద్దాం..

భీమ్‌గల్, మార్చి 29: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలుచేసే వరకు రైతుల పక్షాన పోరాడుతామని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. వరికి రూ.550 బోనస్ ఇచ్చి, క్వింటాలుకు రూ.2700 లకు ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. భీమ్‌గల్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన రైతుల పక్షాన పోరుబాట కార్యక్రమంలో ఆయన పాల్గొనగా.. కమ్మర్‌పల్లి, మోర్తాడ్, భీమ్‌గల్ మండలాలకు చెందిన వందలాది మంది రైతులు తరలివచ్చారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. వరి కోతలు పూర్తయి కల్లాలకు చేరాయని, వెంటనే గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చాలా మంది రైతులు ఇప్పటికే దళారులకు క్వింటాలుకు రూ.2,200 చొప్పున అమ్ముకున్నారని, వారికి కూడా రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 490 ధాన్యం కొనుగోలు కేంద్రాలకుగాను బాల్కొండ నియోజకవర్గంలోనే వందకు పైగా ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు.

**సర్కార్ ఆఫీసులను పంచుకుంటున్నరు..**

కాంగ్రెస్ నాయకులు మండలాల్లో అగ్రస్ పాడినట్లు ప్రభుత్వ కార్యాలయాలను పంచుకొని అక్రమ సంపాదనకు తెరలేపారని మండిపడ్డారు. మండల ఆఫీస్ ఒకరు, తహసీల్ ఆఫీస్ మరొకరు, ఇంకొకరు పోలీస్‌స్టేషన్‌ను పంచుకొని పైరవీలు చేసుకుంటున్నారే తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఒకరిద్దరిని బెదిరించి లేక కొందరు తమ స్వార్థం కోసం పార్టీ మారితే బీఆర్‌ఎస్‌కు వచ్చిన నష్టం ఏమీలేదని స్పష్టం చేశారు. ఆణిముత్యాల్లాంటి కార్యకర్తలు తనతోపాటు కేసీఆర్ వెంటే ఉంటారని, వారెక్కడికి వెళ్లరని నొక్కి చెప్పారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను మెడలు వంచైనా అమలుచేసేలా ప్రజలు, రైతుల పక్షానా పోరాడతున్నామని స్పష్టం చేశారు.

**ఎన్నికల్లో గుణపాఠం చెబుదాం..**

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను సక్రమంగా అమలుచేయకుంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుదామని పిలుపునిచ్చారు. ఓట్లు వేయించుకున్నాక ఇచ్చిన హామీలను అట్టకెక్కిస్తారని అన్నారు. హామీలను అమలుచేసే వరకు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకత్వాన్ని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎక్కడికక్కడ నిలదీయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలతా సురేందర్, ఎంపీపీలు ఆర్మూర్ మహేశ్, శివ లింగు శ్రీనివాస్, లొలపు గౌతమి, జడ్పీటీసీలు చౌట్‌పల్లి రవి, సుంకెట రవి, రాజా గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు దొనకంటి నర్సయ్య, ఏలియా, దేవేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ భగత్, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

### కరెంట్ ఇస్తడంటే ఎట్ల నమ్ముతం..



ఇండ్లకే సక్కగా కరెంటు ఇయ్యనోడు ఎవుసానికి కరెంటు ఇత్తడంటే ఎలా నమ్ముతాం. ఎన్నికల్లో మాయ మాటలు చెప్పి ఓట్లు అడుకున్నారు. ఇప్పుడు అల్ల రంగు బయటపడింది. రైతులను బాధ పెట్టిన ప్రభుత్వం, నాయకులు ఎప్పటికీ బాగు పడరు. మళ్లీ దళారుల వద్దకు పోయే టట్టు జేసింది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.

**-ఆర్మూర్ రాజేశ్వర్, రైతు, చేంగల్, భీమ్‌గల్ మండలం**

### కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతాం..



పంటల కొనడానికి కేంద్రాలను ప్రారంభించలేని రేవంత్ సర్కారు వట్టి మాటలు చెబుతూ మమ్మల్ని మోసం చేస్తున్నది. దళారుల చేతుల్లో మోసపోవడానికి ఉసిగొల్పుతున్నది. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతాం.

**-పులి రాజేశ్వర్, రైతు, తిమ్మాపూర్, మోర్తాడ్ మండలం**

## ఆశీర్వదించండి..
# సేవకుడిగా పనిచేస్తా



నందిపేట్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా తనను ఆశీర్వదించాలని మహిళా ప్రయాణికులను కోరుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి. చిత్రంలో ఎంపీ సురేశ్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, వీజీ గౌడ్

- ప్రజలకు అందుబాటులో ఉంటా..
- ఎంపీ అర్వింద్ ఐదేండ్లలో జిల్లాకు చేసిందేమీలేదు
- బీజేపీ, కాంగ్రెస్ మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దు
- నిజామాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్
- నందిపేట మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం
- పాల్గొన్న ఎంపీ సురేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, వీజీగౌడ్

నందిపేట్, మార్చి 29: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని, సేవకుడిగా పనిచేస్తానని నిజామాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కోరారు. శుక్రవారం ఆయన నందిపేట్‌లో ఎంపీ సురేశ్ రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డితోకలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని సాయిబాబా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నందిపేట్, డొంకేశ్వర్ మండలాల ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నందిగుడిలో ప్రత్యేక పూజల అనంతరం పాదయాత్ర చేపట్టారు. మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ..లోక్‌సభ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. పార్లమెంట్ సమావేశాలు నడిచినప్పుడు ఢిల్లీకి, మిగతా రోజులు ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు దురాశకు పోయి దుఃఖాన్ని తెచ్చుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాలను నమ్మి మోసపోయారని అన్నారు. కల్యాణలక్ష్మి, తులం బంగారం, సీఎం సహాయనిధి చెక్కులు, రైతుబంధు, 24 గంటల విద్యుత్, రూ.2 లక్షల రుణమాఫీ పథకాలు అమలుచేయడంలేదని మండిపడ్డారు. వరికి రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని చెప్పి ఇంతవరకు ప్రారంభించలేదన్నారు. కరెంట్ లేక బోరుబావులు వట్టిపోయి పంటలు ఎండిపోయి రైతన్నలు అరిగోస పడుతున్నారని అన్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ జిల్లాకు చేసిందేమీ లేదన్నారు. ఐదు రోజుల్లో తెస్తానన్న పసుపు బోర్డు ఐదేండ్లు గడిచిపోయిందని, ఇంకా రాలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని బాజిరెడ్డి సూచించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, ఎంపీపీ సంతోష్, జడ్పీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకుడు మచ్చర్ల సాగర్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న బాజిరెడ్డి, సురేశ్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, వీజీ గౌడ్



ఫిల్టర్ నీటిని పరిశీలిస్తున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

# ఫిల్టర్ నీటిలో చెత్త..

### ఇరిగేషన్ అధికారులపై అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ ఆగ్రహం

వినాయక్‌నగర్, మార్చి 29: నగరవాసులకు తాగునీరు సరఫరా చేసే అలీసాగర్, ఖిల్లా వాటర్ ఫిల్టర్ బెడ్‌ను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా శుక్రవారం పరిశీలించారు. నీటిలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల జీవితాలతో ఆడుకుంటారా.. ఇదేం నిర్వహణ.. అంటూ ఖిల్లా ఫిల్టర్ బెడ్ వద్ద నెలకొన్న అధ్వాన స్థితిపై ఇరిగేషన్ అధికారులపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సగం యంత్రాలు పనిచేయడంలేదని అధికారులు చెప్పడంతో అసహనం వ్యక్తంచేశారు. ఖిల్లా ఫిల్టర్ బెడ్ సైతం దారుణంగా ఉందని, సరైన నిర్వహణలేక ఫిల్టర్ నీటిలో నాచు, వ్యర్థ పదార్థాలు, చెత్త పేరుకుపోయిందని, ప్రజల జీవితాలతో ఇరిగేషన్ అధికారులు ఆడుకుంటున్నారని అన్నారు. నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌ద్వారా మాట్లాడారు. వారం రోజుల్లో దీనిపై నివేదిక ఇవ్వాలని, యంత్రాలు అన్ని పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించాలని ఆదేశించారు. అలీసాగర్‌లో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు రెండు నెలలకు సరిపోతాయని ఎమ్మెల్యే తెలిపారు.